క్లుప్తంగా

ఇనుగుర్తి ఎంపీడీఓగా హరిప్రసాద్



కేసముద్రం: ఇనుగుర్తి మండలానికి ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా కేసముద్రం ఎంపీఓ హరిప్రసాద్ గురువారం బాధ్యతలను స్వీకరించారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కృష్ణవేణి

గార్ల: గార్ల ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా కె.కృష్ణవేణి గురువారం బాధ్యతలు స్వీకరించారు. గార్ల తహసీల్దార్‌గా పనిచేసిన రవీందర్‌ను రెండు రోజుల క్రితం కలెక్టర్ సస్పెండ్‌చేసిన విషయం విధితమే. అదే విధంగా గార్ల డీటీగా బి.సంజీవ గురువారం బాధ్యతలు స్వీకరించారు.

రూ.50వేల ఆర్థికసాయం



కేసముద్రం: కేసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు నిర్వహించిన మధ్యాహ్న భోజన కార్యక్రమానికి, మాజీ జెడ్పీటీసీ వేం పురుషోత్తంరెడ్డి జ్ఞాపకార్థంగా వేం ట్రస్టు ఆధ్వర్యంలో రూ.50వేల ఆర్థికసాయాన్ని అధ్యాపకులకు గురువారం అందజేశారు. మార్కెట్ చైర్మన్ గంట సంజీవరెడ్డి సమన్వయంతో చేపట్టిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అజీజ్‌భేగ్, తేరాల శ్రీనివాస్, తేరాల వీరభద్రం, పోలెపల్లి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

గాంధీకి ఘన నివాళి



సాక్షి నెట్‌వర్క్: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని గురువారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 26నుంచి 29వరకు ఖమ్మం జిల్లాలో నిర్వహించిన ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాస్థాయిలో జరిగిన అండర్–14 బాస్కెట్ బాల్ టోర్నమెంట్‌లో మానుకోట విద్యార్థులు ప్రతిభ చూపి మొదటిస్థానంలో గెలిచారని అసోసియేషన్ కార్యదర్శి ముల్లంగి ప్రతాప్‌రెడ్డి గురువారం తెలిపారు. కార్యక్రమంలో కోచ్ వెలిశాల కుమారస్వామి, సీనియర్ క్రీడకారులు చీకటి చంద్రయ్య, మొగిలి ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రయోగ పరీక్షల్లో సీసీ కెమెరాలను నిషేధించాలి


మహబూబాబాద్ అర్బన్: ఇంటర్ ప్రయోగ పరీక్షలో సీసీ కెమెరాలను నిషేధించాలని జిల్లా ప్రైవేట్ జూనియర్ కళాశాలల యాజమాన్యం బిక్కి వెంకటేశ్వర్లు, శ్రీపాల్‌రెడ్డి, మోజేస్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఇంటర్మీడియట్ విద్యాశాఖ కార్యాలయంలో డీఐఈఓ సీహెచ్. మధార్‌గౌడ్‌కు గురువారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రఘునాథరెడ్డి, మల్లేశం, రామచంద్రయ్య, సంధ్యారాణి, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక విద్యతో మేల్కొలుపు



మహబూబాబాద్ రూరల్: ఆధ్యాత్మిక విద్య అభ్యసించడం ద్వారా సంఘ, సహవాస అభివృద్ధి, సామాజిక మేల్కొలుపు జరుగుతుందని హెడ్ బైబిల్ కళాశాల వ్యవస్థాపక డైరెక్టర్ రైట్ రెవరెండ్ బిషప్ డాక్టర్ ఆర్.విక్రంపాల్ అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని బేతోలు గ్రామంలో గల బేతేల్ చర్చిలో హెడ్ బైబిల్ కళాశాల ద్వారా బ్యాచిలర్ ఇన్ థియాలజీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో తెలంగాణ బిషప్ కౌన్సిల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్ మల్సూర్ నాయక్, జాయింట్ సెక్రెటరీ బిషప్ ఏసుపాదం పాల్గొన్నారు.

ఒకే ఉపాధ్యాయుడు



నెల్లికుదురు: మండలంలోని కాచికల్ ప్రాథమికోన్నత పాఠశాలలో 27మంది విద్యార్థులకు ముగ్గురు ఉపాధ్యాయులతో కొనసాగుతోంది. గురువారం పాఠశాలలో ఐదుగురు విద్యార్థులతో ఒకే ఉపాధ్యాయుడు ప్రార్థన సమయంలో కనిపించాడు.

గుంతలు.. వాహనదారుల చింతలు

- ఆదమరిచి ప్రయాణిస్తే అంతే సంగతులు
- పలుచోట్ల ప్రమాదకరంగా మలుపులు
- పట్టించుకోని అధికారులు



రోడ్డుపై ఏర్పడిన గుంతలు



గుంతల రోడ్డుపై వెళ్తున్న ద్విచక్రవాహనం

చిన్నగూడూరు: బీటీ రోడ్డు గుంతలమయం కావడంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని గుండంరాజుపల్లి, బావోజీతండా, పగిడిపల్లి గ్రామాల నుంచి మండల కేంద్రం వరకు రోడ్డు గుంతలమయంగా మారింది. రోడ్డుపై గుంతలు పడడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్న దుస్థితి నెలకొంది. రాత్రిపూట ఆదమరిచి ప్రయాణం చేస్తే అంతే సంగతులు. సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి రోడ్డుపై ఉన్న గుంతలకు మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

కానరాని సూచిక బోర్డులు

మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే రోడ్లు మూలమలుపులు ప్రమాదకరంగా మారాయి. మలుపుల వద్ద సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతోపాటు రోడ్డు వెంబడి పిచ్చి చెట్లు పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మండలంలోని జయ్యారం, పగిడిపల్లి, గుండంరాజుపల్లి, విస్సంపల్లి గ్రామాలకు వెళ్లే రహదారుల్లో మూలమలుపులు అధికంగా ఉండడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు స్పందించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయిస్తాం..

రోడ్డుపై పడిన గుంతలను పూడ్చి సమస్యను పరిష్కరిస్తాం. మండలంలో ఉన్న రోడ్లను సందర్శించి గుంతలు ఏర్పడిన రోడ్లకు మరమ్మతులు చేస్తాం. ప్రమాదకరంగా ఉన్న మూలమలుపుల వద్ద సూచిక బోర్డులను అమరుస్తాం. ఏంఆర్‌ఆర్‌లో మెయింటెనెన్స్ నుంచి మరమ్మతులు చేయించి గుంతలు లేకుండా చేస్తా.

– అజయ్ కుమార్, ఇన్‌చార్జ్ ఏఈ, ఆర్‌అండ్‌బీ

హామీలు నెరవేర్చని కాంగ్రెస్ ప్రభుత్వం



తొర్రూరు: గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న దయాకర్‌రావు

సాక్షి నెట్‌వర్క్: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ ప్రజలను అన్నీ విధాలుగా మోసగిస్తుందని బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో గురువారం జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ మాట్లాడుతూ.. 'మహాత్మా కాంగ్రెస్ నాయకులకు జ్ఞానోదయం కలిగించు' అన్నారు. ప్రజలకు ఇచ్చిన 420 వాగ్దానాలను అమలు చేయలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తూ ప్రజలను అన్నీ విధాలుగా మోసగిస్తుందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. గురువారం డివిజన్ కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని పేర్కొంటూ మహాత్మగాంధీ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్వర చికిత్సతో కుష్ఠు నిర్మూలన



కురవి: ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

కురవి/నెల్లికుదురు: సమాజంలో ముందస్తు అవగాహన, సత్వర చికిత్సతో కుష్ఠు వ్యాధిని నిర్మూలించవచ్చని డిప్యూటీ పారా మెడికల్ ఆఫీసర్ ఎల్లయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా బలపాల పీహెచ్‌సీల వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి, ఎంపీడీఓ కార్యాలయంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్లు విరాజిత, స్రవంతి, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు శ్రీహరి, భద్రమ్మ, హెచ్‌ఈఓ గౌసుద్దీన్, పీహెచ్‌ఎన్ శోభా, హెల్త్ సూపర్‌వైజర్లు రాజకుమారి పాల్గొన్నారు.

మరిపెడ: జాతీయ కుష్ఠువ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా మరిపెడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి గుగులోతు రవి, డాక్టర్ స్వామి, వైద్య బృందం పాల్గొన్నారు.

గార్ల: గార్ల హైస్కూల్లో కుష్ఠువ్యాధి నివారించేందుకు విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వ్యాధి నివారణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి ముల్కనూరు పీహెచ్‌సీ సీహెచ్‌ఓ సక్కుబాయి అవగాహన కల్పించారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రవి

మహబూబాబాద్ అర్బన్: రాష్ట్రంలో అన్ని గురుకులాల్లో మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని టీఎస్ యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని జ్యోతిబాపూలే గురుకులంను గురువారం సంఘం నాయకులు సందర్శించారు. ఈసందర్భంగా రవి మాట్లాడుతూ.. ఉపాధ్యాయ, అధ్యాపకులకు జీరో వన్ జీరో పద్దు ద్వారా వేతనాలు చెల్లించాలని, అన్ని గురుకులాలను ఒకే మెనేజ్మెంట్ కిందకు తీసుకురావాలని, అసంబద్ధమైన పని వేళలను మార్చాలని, ఆరోగ్య కార్డులు అందజేసి కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహితవైద్యం అందించాలన్నారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులకు గెజిటెడ్ హోదా కల్పించాలని, ఉద్యోగ ఉపాధ్యాయులకు సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఏ.మురళీకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యమిషన్ కార్యక్రమాలపై కళాప్రదర్శన



మాట్లాడుతున్న అధికారి

బయ్యారం: జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాలపై మండలంలోని బయ్యారం, గంధంపల్లి పీహెచ్‌సీల పరిధిలో గురువారం సాంస్కృతిక సారథి కళాకారులు కళాప్రదర్శనల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఉప్పలపాడు, సంతులాల్‌పోడుతండా, సింగారం గ్రామాల్లో నిర్వహించిన కళాప్రదర్శనలను ఉద్దేశించి జిల్లా మాస్‌మీడియా అధికారి కొప్పు ప్రసాద్ మాట్లాడారు. జిల్లాలో ఆడపిల్లల నిష్పత్తి తక్కువగా ఉందన్నారు. అనంతరం కళాకారులు పరిసరాల పరిశుభ్రత, కీటకజనిత వ్యాధులు తదితర అంశాలపై పాటల ద్వారా చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఉస్మాన్, హెల్త్ ఎడ్యుకేటర్ రాజు, పురుషోత్తం, రవీందర్‌గౌడ్, వెంకన్న పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి



బహుమతులు అందజేస్తున్న డీఈఓ

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు బాల్యం నుంచే పర్యావరణ స్పృహను కలిగి ఉండి పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని డీఈఓ ఏ.రవీందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఫాతిమా హైస్కూల్‌లో గురువారం ఎన్‌జీసీ నేషనల్ గ్రీన్ కోర్టు వేస్ట్ టు వెల్త్ ఎగ్జిబిషన్ బహుమతి ప్రధానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయ నిర్ణేతలు చంద్రశేఖర్, సత్యనారాయణ, ప్రాజెక్ట్ ఆఫీసర్ విద్యాసాగర్, ఏసీజీఈ మందుల శ్రీరాములు, జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ వి.గురునాథరావు, సైన్స్ ఆఫీసర్ అప్పారావు పాల్గొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో, జెడ్పీహెచ్‌ఎస్ బాలికల పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు దాత కిరణ్‌ప్రసాద్ జ్యోతి అందజేసిన ఇంగ్లిష్ స్టడీ మెటీరియల్స్‌ను డీఈఓ రవీందర్‌రెడ్డి పంపిణీ చేశారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

నెల్లికుదురు: చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని నర్సింహులగూడెం గ్రామంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై చిర్ర రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం .. నర్సింహులగూడెం గ్రామానికి చెందిన చల్లమల్ల గుట్టస్వామి (54) ఈనెల 6న ఇంటిముందున్న చెత్తను చదును చేస్తున్న విషయంలో గొడవ జరిగి అదే గ్రామానికి చెందిన పెద్దూరి నర్సయ్య గుట్టస్వామిని తోసేశాడు. దీంతో కిందపడిన గుట్టస్వామికి కాలుకు దెబ్బలు తాకడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఎంజీఎం ఆస్పత్రికి తరలించి వైద్య పరీక్షలు చేయించగా ఒంట్లోని అవయవాలు పూర్తిగా దెబ్బతిన్నట్లు తెలిపారు. చికిత్స పొందుతూ ఈనెల 29న రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. గురువారం మృతుడి భార్య చల్లమల్ల హైమ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమాన కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

ఆశ్రమ విద్యార్థి అదృశ్యం



గూడూరు: ఆశ్రమ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కనిపించడం లేదని వచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.గిరిధర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని సీతానగరం గ్రామంలోని గిరిజన బాలుర ఆశ్రమ ఉన్నత పాఠశాలలో, కేసముద్రం మండలం కోమటిపల్లితండాకు చెందిన ఇస్లావత్ నరసింహ కుమారుడు ఇస్లావత్ చరణ్ ఏడో తరగతి చదువుతున్నాడు. చరణ్ సంక్రాంతి పండుగకు ఇంటికి వచ్చాడు. సెలవుల అనంతరం ఈనెల 23న తండ్రి ఆశ్రమ పాఠశాల ఎదుట దించి లోపలికి వెళ్లమని చెప్పి ఇంటికి వెళ్లాడు. ఈక్రమంలో నేడు గురువారం ఇస్లావత్ వికాస్ అనే విద్యార్థి వార్డెన్ ఫోన్ ద్వారా చరణ్ తండ్రికి ఫోన్‌కు చేసి మీ అబ్బాయి స్కూల్‌కు ఇంకా రాలేదు, ఎప్పుడు వస్తున్నాడు అని అడిగాడు. దీంతో తండ్రి నరసింహ అవాక్కయ్యాడు. ఈనెల 23వ తేదీన పాఠశాల ఎదుట దింపి వచ్చాను కదా, రాకపోవడమేంటి అని వెంటనే పాఠశాలకు చేరుకొని ఉపాధ్యాయులను అడిగాడు. మీ కుమారుడు రాలేదని వారు తెలిపారు. దీంతో బాలుడి తండ్రి ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపాడు. చరణ్ ఆచూకీ తెలిసిన వారు సెల్ (ఇస్లావత్ నరసింహ - 9666574633), గూడూరు పోలీస్ స్టేషన్- 8712656963, ఎస్సై- 8712656962, సీఐ-8712656960 నంబర్లకు ఎవరైనా అబ్బాయి వివరాలు తెలియజేస్తే రూ.10వేల పారితోషికం ఇవ్వనున్నట్లు ఎస్సై తెలిపారు.

భూతగాదాలో ఇద్దరిపై దాడి

మహబూబాబాద్ రూరల్: భూమి తగాదా విషయంలో తలెత్తిన సమస్య కారణంగా ఇద్దరిపై వారి సమీప వ్యక్తులు దాడిచేసి గాయపరిచిన సంఘటన మహబూబాబాద్ మండలంలోని లక్ష్మీపురం (బి) గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని లక్ష్మీపురం (బి) గ్రామానికి చెందిన చల్ల పుల్లయ్య వద్ద 2002లో 100 గజాల భూమినిరూ 1,100కు గుంజ వీరన్న, గుంజ రాజుల తండ్రి గుంజ ఎల్లయ్య కొనుగోలు చేశాడు. ఆ స్థలంలో ఉన్న ఇంకుడు గుంత నిండిపోగా దానిని శుభ్రం చేసేందుకుగా వెళ్లాడు. అదే సమయంలో గ్రామానికి చెందిన ఆలకుంట్ల ఉప్పలయ్య, నరసయ్య, సందీప్, ముఖేష్, దేవి, వల్లపు ఎల్లేష్ తోపాటు మరికొంతమంది అక్కడికి చేరుకుని ఆ స్థలం తమదని వీరన్న, రాజుతో వాగ్వాదానికి దిగారు. అదికాస్త పెరిగి ఘర్షణ వాతావరణం చోటు చేసుకుని ఇద్దరు అన్నదమ్ములు వీరన్న, రాజుపై ఆలకుంట్ల ఉప్పలయ్యతో పాటు వచ్చిన వారంతా కూడా కట్టెలతో దాడిచేసి గాయపరిచారు. జరిగిన సంఘటనపై బాధితులు మహబూబాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ప్రస్తుతం వారు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

హత్య కేసులో భర్త అరెస్ట్

కేసముద్రం: మండలంలోని వెంకటగిరి గ్రామానికి చెందిన వాంకుడోతు రఘు అనేవ్యక్తి, తన భార్య సుగుణపై అనుమానంతో కర్రతోకొట్టి, కత్తితో పొడవడంతో చికిత్స పొందుతూ ఈ నెల 28న మృతి చెందగా పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నిందితుడు వాంకుడోతు రఘు గురువారం పోలీస్‌స్టేషన్‌కు వచ్చి లొంగిపోగా, అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ సర్వయ్య తెలిపారు.

నర్సరీల ఏర్పాటుతో ఆర్థికాభివృద్ధి

మహబూబాబాద్ రూరల్: యువ రైతులు స్వతహాగా నర్సరీలను ఏర్పాటు చేసుకుని, ఆర్థిక అభివృద్ధి సాధించాలని మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి అన్నారు. షెడ్ నెట్ల కింద నర్సరీ పెంపకంపై 30మంది యువ రైతులకు ఆర్య ప్రాజెక్టులో భాగంగా మండలంలోని మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, ఆర్య ప్రాజెక్టు శిక్షణ ఇన్‌చార్జ్ శాస్త్రవేత్త బి.క్రాంతికుమార్, మండల ఉద్యాన అధికారి శాంతిప్రియదర్శిని, మల్యాల హెచ్‌ఆర్‌ఎస్ ప్రధాన శాస్త్రవేత్త నాగరాజు, శాస్త్రవేత్త ప్రశాంత్ పాల్గొన్నారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

నెల్లికుదురు: కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం, యూనిఫైడ్ స్కీంలు పాత పెన్షన్ విధానానికి ప్రత్యామ్నాయం కాదని వాటి రద్దు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉందని కేంద్ర ప్రభుత్వం భూకాయిస్తుందని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్ధోజు కవిత అన్నారు. మండలంలోని ఆలేరు జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో గురువారం నిర్వహించిన మావేశంలో ఆమె మాట్లాడారు. పాత పెన్షన్ విధానాన్ని అమలు చేసి ఉద్యోగ ఉపాధ్యాయులను కాపాడాల్సిన బాధ్యత కేంద్ర ప్రభుత్వంపై ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బలాష్టి రమేశ్, భిక్షపతి, ఎంఈఓ రాందాస్, సంగ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ సామాజిక తనిఖీ



ఇన్ హౌజ్ వేదికలో పాల్గొన్న అధికారులు

మరిపెడ/ మరిపెడ రూరల్: మరిపెడ మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఓ సమావేశ హాలులో మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో చేపట్టిన పనులపై 14వ విడత సామాజిక తనిఖీ ఇన్ హౌజ్ వేదిక గురువారం నిర్వహించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో కూలీలు, ప్రజలు లేకుండానే ఓ గదిలో తూతూ మంత్రంగా కొనసాగింది. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ మధుసూదన్ రాజ్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. మొదటి రోజు 26 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన వివిధ పనులపై నివేదికలను చదివి వినిపించారు. కార్యక్రమంలో డీవీసీ మన్‌మోహన్, అంబుడ్స్ పర్సన్ ఆదామ్, ఎస్ఆర్‌పీ చెన్నకేశవులు, ఎస్ఆర్‌పీ కొమురమ్మ, ఏపీసీ అంజిగౌడ్, ఎంపీడీవోలు ధన్‌సింగ్, కనకదుర్గ పాల్గొన్నారు. మండలంలోని ఎల్లంపేట, లక్ష్మాత్మండా గ్రామాల్లోని ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతి అక్రమాలపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టాలని అదే గ్రామానికి చెందిన యువకులు డీఆర్డీఓకు ఫిర్యాదు చేశారు.

సంక్షిప్త సమాచారం

కార్మికులకు కనీస వేతనం ఇవ్వాలి

మహబూబాబాద్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికులకు కనీసవేతనం రూ.26వేలు ఇవ్వాలని ట్రేడ్ యూనియన్ సెంటర్ ఆఫ్ ఇండియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొత్తపల్లి రవి, బి.సూర్యం, తెలంగాణ ప్రగతి శీల మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.వెంకన్న డిమాండ్ చేశాడు. ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట ధర్నా చేసి మేనేజర్ శ్రీధర్‌కు వినతిపత్రాన్ని అందచేశారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, రాములాల్, శ్రీనివాస్, ఉపేందర్ పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

తొర్రూరు రూరల్: మండలంలోని సోమారం గ్రామంలో గీత కార్మికుడు రావుల దామోదర్‌గౌడ్ గురువారం రోజువారీగా తాటి చెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలుజారి కిందపడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే హన్మకొండలోని ఓ ప్రవేట్ ఆస్పత్రికి తరలించారు.

సాగునీరు విడుదల చేయాలి

గూడూరు: మండలంలోని మచ్చర్ల శివారు రేగడి తండాలో గురువారం బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోతు కవిత ఓ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, తిరుగు ప్రయాణంలో పాకాల వాగులో సాగునీరు విడుదల చేయాలని ఈఈతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను వివరించారు.

క్రాస్ కంట్రీలో బంగారు పతకం

మహబూబాబాద్ రూరల్: కరీంనగర్ పట్టణంలో జరుగుతున్న తెలంగాణ రాష్ట్ర పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్‌లో గురువారం వీరన్న 10కిలోమీటర్ల (క్రాస్ కంట్రీ) పరుగు పందెం 35 నిమిషాల్లో పూర్తిచేసి ఉత్తమ ప్రతిభ కనబరచి మరో బంగారు పతకాన్ని గెలుచుకున్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

తొర్రూరు: పెండింగ్‌లో ఉన్న ఈజీఎస్ సిబ్బంది వేతనాలను వెంటనే చెల్లించాలని టీఏల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ డిమాండ్ చేశాడు. గురువారం డివిజన్ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఏపీఓ మధుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఏల సంఘం మండల అధ్యక్షుడు సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రానైట్ లారీల సీజ్

కురవి: అధిక లోడుతో వెళ్తున్న ఆరు గ్రానైట్ లారీలను పట్టుకున్నట్లు కురవి ఎస్సై గండ్రాతి సతీష్ గురువారం తెలిపారు. మహబూబాబాద్ నుంచి కురవి మీదుగా ఖమ్మం వైపు అధికలోడుతో వెళ్తున్న ఆరు గ్రానైట్ లారీలను పట్టుకుని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన వివరించారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన వివరించారు.

సర్వే రెమ్యునేషన్ తక్షణమే చెల్లించాలి

మరిపెడ రూరల్: కుల సర్వే నిర్వహించిన ఉపాధ్యాయులకు తక్షణమే ప్రభుత్వం ఇస్తానన్న రెమ్యునేషన్ చెల్లించాలని పీఆర్‌టీయూ మరిపెడ మండల అధ్యక్ష, కార్యదర్శులు కసీర రమేష్‌రెడ్డి, లింగాల మహేష్ గౌడ్ గురువారం డిమాండ్ చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

కురవి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మేక వెంకటేస్ అన్నారు. గురువారం మండలంలోని మోద్గులగూడెం ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం తయారీని పరిశీలించారు. కార్యక్రమంలోనాయకులు ప్రకాశ్, లింగేశ్వర్ పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్య తీసుకోవాలి

మరిపెడ: మరిపెడ మండలం నీలికుర్తి, ఎల్లంపేట గ్రామాల్లో ఉపాధి హామీ అవినీతి, అక్రమాలకు పాల్పడిన ఫీల్డ్ అసిస్టెంట్లపై విచారణ చేపట్టి చర్య తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి అల్వాల వీరయ్య, సీపీఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు.

రుణమాఫీ చేయాలని బైక్ యాత్ర

కురవి: మండలంలోని రాజోలు శివారు హరిదాసు తండా నుంచి రైతు భూక్య విజయ్‌కుమార్ వంద శాతం రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం బైక్‌యాత్ర ప్రారంభించారు. యాత్రకు మద్దతుగా బానోత్‌వీరన్న, భూక్యప్రసాద్ పాల్గొన్నారు. హర్యతండా, పోలంపల్లి తండా, స్టేషన్ గుండ్రాతిమడు గ్రామాల్లో చేపట్టారు.

ఆగిన కోడిగుడ్ల సరఫరా

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాల అంగన్‌వాడీ కేంద్రాలకు ప్రభుత్వం అందించాల్సిన కోడిగుడ్ల సరఫరా ఆగిపోయినా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పోలీసుల బైక్ ర్యాలీ

నర్సింహులపేట: జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా రోడ్డు భద్రత నియమాలను పాటించాలని గురువారం మండల కేంద్రంలో పోలీసులు బైక్ ర్యాలీ తీశారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ఎస్సై మాలోతు సురేష్ అధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్ నుంచి చౌరస్తా వరకు పోలీసులు హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ తీశారు.

బాలికపై దాడికి యత్నం

కేసముద్రం: మండలంలోని ఓ గ్రామంలో గురువారం ఓ బాలికపై గుర్తుతెలియని వ్యక్తులు దాడికి యత్నించినట్లు, ఆ బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎస్సై మురళీధర్ రాజును వివరణ కోరగా, తమకు వచ్చిన ఫిర్యాదుపై సీసీ ఫుటేజ్‌లను పరిశీలించామని, అలాంటి సంఘటన జరగలేదని తెలిపారు.

విద్యతోనే అన్నిరంగాల్లో అభివృద్ధి

మహబూబాబాద్ రూరల్: విద్యతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని, అన్నిరంగాల్లో కూడా అభివృద్ధి సాధించగలుగుతామని తహసీల్దార్ భగవాన్‌రెడ్డి అన్నారు. పౌరహక్కుల దినోత్సవం సందర్భంగా మండలంలోని వీఎస్.లక్ష్మీపురం గ్రామంలోని ఎస్సీ కాలనీలో గురువారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో రూరల్ ఎస్సై వి.దీపిక, ఆర్ఐ కృష్ణ ప్రసాద్, ఏఎస్సై రమేష్, హెడ్ కానిస్టేబుల్ రమేశ్, పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు

కురవి: సీరోలు మండలం రేకుల తండా, వస్రాం తండాల్లో మహబూబాబాద్ ఎక్సైజ్ శాఖ, సీరోలు పోలీసులు సంయుక్తంగా గురువారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. 5వందల లీటర్ల బెల్లం పానకాన్ని, వంద లీటర్ల నాటు గుడంబాను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎక్సైజ్ సీఐ చిరంజీవి, సీరోలు ఎస్సై నగేష్ పాల్గొన్నారు.

అండర్ పాస్ పునరుద్ధరణ పనులు ప్రారంభం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలోని సిగ్నల్ కాలనీ వద్ద ఉన్న రైల్వే అండర్ పాస్ పునరుద్ధరణ పనులను గురువారం ప్రారంభించారు. రైల్వే అండర్ పాస్ పునరుద్ధరించాలని సీపీఐ మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి ఆధ్వర్యంలో రైల్వే అధికారులకు విజ్ఞప్తి చేయగా పునరుద్ధరణ పనులు చేపట్టారు. కార్యక్రమంలో పెరుగు కుమార్, దాసు, వికాస్ పాల్గొన్నారు.

మానుకోటలో నాగసాధు హల్‌చల్



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో నాగసాధు అఘో కారు నడుపుతూ అతివేగంగా వెళ్తుండగా ఒక్కసారిగా జిల్లా కేంద్రంలోని సూర్య థియేటర్ ప్రాంతంలో కారు సడన్ బ్రేక్ వేయడంతో ప్రమాదవశాత్తు వెనుక నుంచి వచ్చిన ఓ ద్విచక్రవాహనం ఆ కారును ఢీకొట్టింది. వెంటనే నాగసాధు కారులో నుంచి దిగి సదరు ద్విచక్ర వాహనదారుడిపై చేయి చేసుకుంది.

కురవిలో ప్రత్యక్షమైన అఘోరీ

కురవి: మండల కేంద్రంలో మహిళా అఘోరీ నాగసాధు గురువారం సాయంత్రం కారులో ప్రత్యక్షమైంది. పెద్ద చెరువు వద్ద కారు ఆపడంతో వచ్చిపోయే వాహనచోదకులు ఆమెను చూసి సెల్ఫీలు దిగేందుకు పోటీపడ్డారు. కొందరు వీడియోలు తీస్తుండగా ఆ యువకులతో అఘోరి గొడవపడింది.